నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
12 నిజామాబాద్ మంగళవారం 12 నవంబర్ 2024 ADILABAD NIRMAL


మృతురాలు స్వాతి ప్రియ(ఫైల్)


అరవింద్(ఫైల్)


విద్యార్థిని మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు

# ట్రిపుల్ ఐటీలో చావుకేక

## కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆగని మృత్యుఘోష

### 11 నెలల కాలంలో నలుగురు మృత్యువాత

- తాజాగా ఆర్మూర్‌కు చెందిన విద్యార్థిని ఉరివేసుకుని మృతి
- నా బిడ్డను యాజమాన్యమే చంపేసిందని తల్లిదండ్రుల ఆరోపణ
- ఏబీవీపీ కార్యకర్తలు, సెక్యూరిటీ సిబ్బంది మధ్య ఘర్షణ
- ఏబీవీపీ కార్యకర్త తలకు తీవ్రగాయాలు.. పరిస్థితి విషమం..
- ఘటన స్థలాన్ని పరిశీలించిన భైంసా అడిషనల్ ఎస్పీ


ప్రవీణ్(ఫైల్)


శిరీష(ఫైల్)

బాసర, నవంబర్ 11 : నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల మరణాలు ఆగడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వ 11 నెలల కాలంలో నలుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. గతంలో అరవింద్, ప్రవీణ్, శిరీషలు మృత్యువాత పడ్డారు. సోమవారం పీయూసీ రెండో సంవత్సరం చదువుతున్న స్వాతిప్రియ(18) హాస్టల్ గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌కు చెందిన రవీందర్-ఉజ్వల దంపతుల కూతురు స్వాతిప్రియ ట్రిపుల్ ఐటీలో పీయూసీ రెండో సంవత్సరం చదువుతున్నది. హాస్టల్ గదిలో తోటి విద్యార్థులు టిఫిన్ చేయడానికి మెస్‌కు వెళ్లగా.. ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. తోటి విద్యార్థులు టిఫిన్ చేసి రూంకు వచ్చి చూడగా.. స్వాతి ప్రియ ఉరి వేసుకుని ఉండడంతో విషయాన్ని సెక్యూరిటీ సిబ్బందికి తెలిపారు. ట్రిపుల్ ఐటీ అధికారులు సీఐ రాకేశ్, బాసర ఎస్సై గణేశ్‌లు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందికి దింపి అంబులెన్సులో భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. స్వాతిప్రియ ఫోన్, అక్కడ లభ్యమైన సూసైడ్ లెటర్‌ను స్వాధీనం చేసుకుని స్వాతిప్రియ తల్లిదండ్రులకు సమాచారం అందించారు.

### నాబిడ్డ చావుకు యాజమాన్యమే కారణం

నా బిడ్డను ట్రిపుల్ ఐటీ యాజమాన్యమే చంపేసిందని స్వాతిప్రియ తల్లిదండ్రులు రవీందర్-ఉజ్వల తమ ఆవేదనను వ్యక్తం చేశారు. నా కూతురు ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని, పొద్దున్నే ఫోన్ చేసి మాట్లాడిందని కొద్ది సేపటికే ఉరి వేసుకున్నదని మండిపడ్డారు. ట్రిపుల్ ఐటీ నుంచి ఫోన్ రావడంతో హుటాహుటిన వచ్చామని, మేం వచ్చే సరికి మా కూతురు మృతదేహాన్ని అంబులెన్సులో తీసుకెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మేము వచ్చేంత వరకు ఉంచకుండా అంత తొందరగా తీసుకుపోవాల్సిన అవసరం ఏముందని, ట్రిపుల్ఐటీ యాజమాన్యం వేధింపుల వల్లనే నాబిడ్డ చనిపోయిందని కన్నీరుమున్నీరయ్యారు. అంతేగాకుండా సీనియర్ విద్యార్థితోపాటు మరో తోటి విద్యార్థిని కూడా తనను వేధిస్తున్నారని, నా కూతురు చెప్పిందని ఆఫీసులో ఫిర్యాదు చేయమన్నామని, ఫిర్యాదు చేసినా యాజమాన్యం పట్టించుకోకపోవడంతోనే నా బిడ్డ చావుకు కారణమయ్యారని తాము వాపోయారు. ఇట్టి విషయాలన్నింటిని బాసర ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్నామని, తమకు న్యాయం చేయాలని, నా బిడ్డ చావుకు కారణమైన వారిని శిక్షించాలని ట్రిపుల్ ఐటీ గేటు ఎదుట బంధువులతో కలిసి కన్నీరుమున్నీరుగా విలపించారు.


రోదిస్తున్న విద్యార్థిని తల్లి

### ఇద్దరి ప్రేమ వ్యవహారంలోకి వెళ్లడమే ఆత్మహత్యకు కారణమా?

ట్రిపుల్ ఐటీలో ఈ-3 చదువుతున్న సీనియర్ విద్యార్థి, పీయూసీ-2 చదువుతున్న తోటి విద్యార్థిని మధ్య ప్రేమ వ్యవహారం ఉంది. వీరి మధ్యలో స్వాతిప్రియ ఏదో ఒక సమయంలో ఆకస్మాత్తుగా జోక్యం చేసుకోవడంతో అప్పటి నుంచి సీనియర్ విద్యార్థి స్వాతిప్రియపై బెదిరింపులకు పాల్పడుతున్నాడు. ఈ విషయం తల్లిదండ్రులకు తెలుపగా వారు అధికారులకు ఫిర్యాదు చేయమని చెప్పారు. ఫిర్యాదు చేసిన ఫలితం లేకపోవడం, వారిపై చర్యలు తీసుకోకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురైంది. తనకు న్యాయం జరగలేదని ఆత్మహత్యకు పాల్పడిందా? అని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అంతే కాకుండా ఇంకా ఏమైనా కారణాలు ఉండొచ్చా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.


ఏబీవీపి కార్యకర్తలు, ట్రిపుల్ఐటీ సిబ్బంది మధ్య వాగ్వాదం

### ఏబీవీపీ కార్యకర్తలపై దాడి

విద్యార్థిని ఆత్మహత్య ఘటనపై ట్రిపుల్ ఐటీ మెయిన్ గేట్ ఎదుట ఏబీవీపీ కార్యకర్తలు ధర్నా చేస్తూ గేటుపైకి ఎక్కి లోపలికి వెళ్లే క్రమంలో పోలీసులు, ట్రిపుల్ ఐటీ సెక్యూరిటీ సిబ్బంది వారిని గేటుపై నుంచి దింపే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో సెక్యూరిటీ సిబ్బందికి, ఏబీవీపీ కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. అక్కడ ఉన్న ట్రిపుల్ ఐటీ సీఐ రాకేశ్‌తోపాటు పోలీసులు సెక్యూరిటీ సిబ్బంది ఏబీవీపీ కార్యకర్తలను ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించారు. ఈ క్రమంలో వాగ్వాదం చోటు చేసుకోగా.. ట్రిపుల్ ఐటీ సిబ్బంది ఒకరు ఏబీవీపీ కార్యకర్తపై దాడి చేయడంతో తలకు తీవ్ర గాయమైంది. వెంటనే అంబులెన్సును పిలిపించి భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఏబీవీపీ కార్యకర్త పరిస్థితి విషమంగా ఉంది.


ఏబీవీపీ కార్యకర్తలతో మాట్లాడుతున్న ఏఎస్పీ అవినాశ్‌కుమార్

### ఘటన స్థలాన్ని పరిశీలించిన భైంసా ఏసీపీ

ఏబీవీపీ కార్యకర్తలు ట్రిపుల్ ఐటీ సెక్యూరిటీ సిబ్బంది మధ్య ఉద్రిక్తత నెలకొనడంతో విషయం తెలుసుకున్న భైంసా అడిషనల్ ఎస్పీ అవినాశ్ కుమార్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. మెయిన్ గేటు వద్ద గల సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించి విచారణ ప్రారంభించారు. అనంతరం అక్కడ ఉన్న ఏబీవీపీ కార్యకర్తలతో మాట్లాడారు. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థిని ఆత్మహత్య ఘటనకు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. దీనిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

### కొత్త వీసీ వచ్చినా ఆగని ఆత్మహత్యలు

ట్రిపుల్ ఐటీలో వరుస ఆత్మహత్యలు ఆగడం లేదు. పదకొండు నెలలుగా ట్రిపుల్ ఐటీ నలుగురు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. గత సంవత్సరంలో నవంబర్‌లో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న నాగర్‌కర్నూల్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్ హాస్టల్ గదిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఫిబ్రవరిలో సంగారెడ్డి జిల్లాకు చెందిన పీయూసీ మొదటి సంవత్సరం చదువుతున్న శిరీష హాస్టల్ గదిలో ఉరి వేసుకుంది. ఏప్రిల్‌లో అరవింద్ హాస్టల్ గదిలో ఉరి వేసుకొగా, ఇప్పుడు ఘటనలో మరో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడడంతో విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి ట్రిపుల్ ఐటీపై చిత్తశుద్ధి లేదని, ఇన్‌చార్జి వీసీలను మార్చినప్పటికీ ఆత్మహత్యలు ఆగడం లేదని, విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### హాస్టల్ గదిని పరిశీలించిన ఎస్పీ

సోమవారం రాత్రి ఎస్పీ జానకీ షర్మిల స్వాతిప్రియ ఉన్న హాస్టల్ గదిని పరిశీలించారు. విద్యార్థికి సంబంధించిన పలు వస్తువులు, బ్యాగును పరిశీలించి, ఘటనకు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. విచారణ ప్రారంభించారు. ఆమె వెంట ఏఎస్పీ అవినాశ్, బాసర ఎస్సై గణేశ్ ఉన్నారు.

### హాస్టల్‌లో పర్యవేక్షణ కరువు

ట్రిపుల్ ఐటీలో మొత్తం 9వేల మంది విద్యార్థులుండగా.. ఇందులో 5 వేల మంది విద్యార్థినులు ఉంటారు. వీరికి నలుఉరే కేర్‌టేకర్లు ఉన్నారు. వార్డెన్‌లు, కౌన్సిలర్‌ల సంఖ్య కూడా తక్కువే. దీంతో పర్యవేక్షణ కరువవుతుంది. దీని వలననే ఘటనలు పునరావృతం అవుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.


ట్రిపుల్ఐటీ గేటు ఎక్కడానికి ప్రయత్నిస్తున్న ఏబీవీపీ కార్యకర్తలు


ట్రిపుల్ఐటీ సెక్యూరిటీ సిబ్బంది దాడిలో గాయపడ్డ ఏబీవీపీ కార్యకర్త


ఆదిలాబాద్ మార్కెట్‌యార్డులో రైతుల పడిగాపులు

# పత్తి రైతుల పడిగాపులు

- మధ్యాహ్నం వరకు మార్కెట్ యార్డులో నిరీక్షణ
- తిండి, తిప్పలు లేక ఇబ్బందులు
- రైతుల ఆందోళన, రాస్తారోకో

## సీసీఐ వైఖరికి నిరసనగా జిన్నింగ్‌ల మూసివేత

ఆదిలాబాద్, నవంబర్ 11(నమస్తే తెలంగాణ) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం ఫలితంగా పత్తి రైతులు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకున్నది. ఆదిలాబాద్ జిల్లాలో సీజన్ ప్రారంభం నుంచి మద్దతు ధర లభించక ప్రైవేటు వ్యాపారులకు పంటను అమ్మి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తేమ శాతం పేరిట సీసీఐ పత్తిని మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521 చొప్పున కొనుగోలు చేయకపోవడంతో రైతులు వేయి రూపాయల నష్టానికి ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. పత్తి బేళ్ల తయారీ విషయంలో సీసీఐ సరికొత్త నిబంధనలు అమలు చేయడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. సీసీఐ వైఖరిని నిరసిస్తూ సోమవారం ఆదిలాబాద్ జిల్లాలో జిన్నింగ్ వ్యాపారులు సమ్మెకు దిగారు. జిన్నింగ్‌లను మూసివేసి నిరసన తెలిపారు. పత్తి కొనుగోళ్లను నిరాకరించడంతో రైతులు మార్కెట్ యార్డులో కాంటా ప్రారంభంకాలేదు. దీంతో రైతులు పంటను అమ్ముకోవడానికి పడిగాపులు కాయాల్సి వచ్చింది.


మార్కెట్ యార్డుకు వచ్చిన పత్తి ట్రాక్టర్లు

### ఎలాంటి ప్రకటన లేకుండా నిలిపివేత

ఆదివారం మార్కెట్‌కు సెలవు కావడంతో సోమవారం పెద్ద సంఖ్యలో రైతులు వాహనాల్లో పత్తిని విక్రయించడానికి ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు తీసుకొచ్చారు. మార్కెటింగ్ శాఖ అధికారులు కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కొందరు రైతులు ఆదివారం రాత్రి, మరికొందరు ఉదయం 5 గంటల నుంచి పత్తిని తీసుకొచ్చారు. తీరా కాంటా ప్రారంభంకాకపోవడంతో రైతులు తిండి, తిప్పలు లేక ఎండలో అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. పంటను కొనుగోలు చేయాలని అధికారులను కోరినా హైదరాబాద్‌లో ప్రైవేటు జిన్నింగ్ యజమానులతో చర్చలు జరుగుతున్నాయని, జిల్లాకు సంబంధించిన సమస్య కాదని అధికారులు రైతులకు సూచించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభం కావాల్సిన పత్తి కొనుగోళ్లు మధ్యాహ్నం 1.00 ప్రారంభమయ్యాయి.

### అన్నదాతల ఆగ్రహం

పత్తి కొనుగోళ్లు మధ్యాహ్నం వరకు ప్రారంభంకాకపోవడంతో రైతులు ఆందోళన చేపట్టారు. మార్కెట్ యార్డు సమీపంలోని పంజాబ్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు రైతులకు నచ్చచెప్పే ప్రయత్నం చేసినా వారు వినలేదు. పత్తి కొనుగోళ్లను ప్రారంభించాలని కోరారు. కొనుగోళ్లలో జాప్యం జరగడంతో తాము వాహనాల కిరాయి రెండింతలు చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. జిన్నింగ్‌ల సమ్మె ఉందని అధికారులు ముందుగా చెబితే తాము పత్తిని మార్కెట్‌కు తీసుకొచ్చేవాళ్లం కాదన్నారు.


రాస్తారోకో చేస్తున్న రైతులు


పంట కొనుగోలు చేయాలని మార్కెటింగ్ అధికారులను నిలదీస్తున్న రైతులు

### పొద్దున 5 గంటలకు వచ్చిన..



*నేను పొద్దున 5 గంటలకు 18 క్వింటాళ్ల పత్తిని అమ్మడానికి ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు తీసుకొచ్చిన. పగలు ఒంటి గంట అవుతున్నా ఇంకా కొనుగోళ్లు జరగడం లేదు. తిండి, తిప్పలు లేక ఇబ్బందులు పడుతున్నాం. కొనుగోళ్లలో జాప్యం కారణంగా వాహనం కిరాయి పెంచుతారు. దీంతో నష్టం పెరుగుతుంది. పత్తి కొంటలేమని అధికారులు ముందుగా చెబితే తీసుకొచ్చేవాళ్లం కాదు. కొనమని అడిగితే తాము ఏమీ చేయలేమని మార్కెటింగ్ అధికారులు అంటున్నారు. పత్తిలో తేమ ఉందని సీసీఐ కొంటలేదు. దీంతో రైతులు ప్రైవేటుకు అమ్మి నష్టపోతున్నారు.*

**- దేవన్న, రామాయి, ఆదిలాబాద్ రూరల్ మండలం**

## ఎన్నికల హామీలను ప్రభుత్వం విస్మరించింది

ఇచ్చోడ(సిరికొండ), నవంబర్ 11 : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సిరికొండ మండలంలోని సిరిచెల్మ, నారాయణపూర్, నేరడిగొండి(జీ), ఎల్లమ్మగూడ, జెండగూడ గ్రామాల్లో పర్యటించారు. సిరిచెల్మలో మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఎల్లమ్మగూడలో రూ.2.50 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. అనంతరం వడ్డెర్‌గూడ గ్రామంలో రచ్చబండ వద్ద వృద్ధులతో ముచ్చటించి సమస్యలు తెలుసుకున్నారు. రూ.4 వేల పింఛన్‌రావడం లేదని, ఇప్పటి ప్రభుత్వం మోసం చేసిందని ఎమ్మెల్యేతో వృద్ధులు మొర పెట్టుకున్నారు. అనంతరం ఇచ్చోడ మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో నిర్వహించిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ ఇచ్చోడ మండలాధ్యక్షుడు ఎనుగుల కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, సిరికొండ మాజీ సర్పంచ్ పెంటన్న, కో-ఆప్షన్ సభ్యులు ఎక్బల్, బీఆర్‌ఎస్ నాయకులు, పాండు, సూర్యకాంత్, రమేశ్, గణేశ్, ఏఈ సతీశ్, తదితరులు పాల్గొన్నారు.


ఎల్లమ్మగూడలో బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ఎదులాపురం, నవంబర్ 11 : మున్సిపల్‌లో పని చేసే కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ అన్నారు. సోమవారం మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ.. కరోనా కాలంలో మున్సిపల్ కార్మికులను సేవలను కొనియాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ కార్మికుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్నా ఎలాంటి చర్య లేదన్నారు. మున్సిపాలిటీలో పని చేసే ప్రతి కార్మికుడిని ప్రభుత్వ ఉద్యోగిగా గుర్తించడంతోపాటు ప్రతి నెల 5వ తేదీలోపు వేతనాలు, పీఆర్సీ, ఇంక్రిమెంట్ ఇవ్వాలన్నారు. యూనియన్ నాయకులు కాంతరావ్ పాల్గొన్నారు.


మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

## సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

### ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, నవంబర్ 11 : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సర్వే నమోదులో ఎన్యూమరేటర్లు ఎలాంటి తప్పులకు తావు ఇవ్వొద్దని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఆయా గ్రామాల్లో పర్యటించి సర్వే ప్రక్రియను పరిశీలించారు. ముందుగా యాపల్‌గూడలో పర్యటించిన కలెక్టర్ ఇంటింటి సర్వేలో ఎన్యూమరేటర్లు నమోదు చేస్తున్న తీరును చూసి సూచనలు చేశారు. అనంతరం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని వాన్‌వాట్ ఇతర గ్రామాల్లో తిరుగుతూ ఎన్యూమరేటర్లకు అవగాహన కల్పించి నమోదులో తప్పులకు ఆస్కారం లేకుండా వివరాలు పక్కాగా నమోదు చేయాలని సూచించారు. ఇంటి యజమని వివరాలను స్వయంగా కలెక్టర్ స్వీకరించి ఎన్యూమరేటర్ల ద్వారా నమోదు చేయించారు. రూరల్ మండలం ప్రత్యేక అధికారి, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం పద్మభూషన్‌రాజు ఉన్నారు.


సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా